

సమావేశంలో పాల్గొన్న రవీందర్ తదితరులు

పెండింగ్ డీఏ మంజూరు చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లాశాఖ ఆధ్వర్యంలో ముషీరాబాద్ మండలంలోని నల్లకుంట, మాణికేశ్వర్‌నగర్, సీతాఫల్‌మండి, జమిస్తాన్పూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఆర్థిక బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేసే ముందు ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాలలో విఫలమైన 5+3+3+4 విధానాన్ని అమలు చేసే ముందు అక్కడ ఎదురైన సవాళ్లను, అమలులో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కల్పించే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల, ఎన్.గౌతమ్‌రావు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. రక్తం కొరతతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని వారు పేర్కొన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని నగర బీజేపీ కార్యాలయంలో ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తం కొరత లేకుండా మోదీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని, రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, నాయకులు మంత్రి చంద్రశేఖర్, జి.ఆనంద్‌గౌడ్, జయశ్రీ, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, కృష్ణగౌడ్, సందీప్‌సాయి, ప్రవీణ్, అనంతలక్ష్మి, శ్యామ్‌రాజ్, అవినాష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పాలి



స్వామివారి దర్శనం అనంతరం వినోద్‌రెడ్డి, రాజమాంజనేయులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పాలని వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని, యువత భక్తిభావం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఆలయ ఈవో కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజావాణి నోడల్ అధికారిగా రామాంజనేయులు

చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో కె.రామాంజనేయులు ప్రజాభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరించారు. ఆయన మూడు రోజుల పాటు ప్రజావాణి నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ -1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. శంకర్‌మఠ్, ఏపీ టూరిజం 11కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు.. బర్కత్‌పుర, రామాలయం పరిధిలో 11.30 నుంచి 12 వరకు.. గాంధీనగర్ పరిధిలో 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. విద్యానగర్, బౌద్ధనగర్ పరిధిలో 12 నుంచి 12.30 వరకు.. అడిక్‌మెట్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 వరకు.. బాలాజీనగర్, రేణుకా ఎన్‌క్లేవ్ పరిధిలో 3 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఖేలో ఇండియా సైక్లింగ్ లీగ్‌లో నగర యువతుల ప్రతిభ



పతకాలతో శివ, రత్నిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా మహిళల సైక్లింగ్ లీగ్‌లో హైదరాబాద్ సైక్లిస్టులు శివ బింద్య స్వర్ణం నెగ్గగా.. రత్నిక రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించింది. కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఈ పోటీల్లో 2 కి.మీ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్లలో శివ, రత్నిక పతకాలు నెగ్గారు. వీరు హైదరాబాద్‌లోని మ్యాక్స్‌వెల్ ట్రైవర్ సైక్లింగ్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు.



డిప్యూటీ సీఎం భట్టికి ప్రసాదం అందజేస్తున్న జై సంతోషి మాత ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పటిష్టమైన చర్యలతోనే ప్రశాంతంగా నిమజ్జనం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకున్న పటిష్టమైన చర్యల వల్లే నగరంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. కాచిగూడ డివిజన్ ఇసామియాబజార్‌లో జై సంతోషి మాత ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని కమిటీ సభ్యులు సంపత్‌కుమార్, సందీప్‌రెడ్డి, చాణక్య, కార్తీక్‌రెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో కలిసి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం సందర్భంగా మండప నిర్వాహకులు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించారన్నారు. పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు.

విశ్వనాథ సత్యనారాయణ జయంతి



నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, కళా జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథ సత్యనారాయణ దేశ సాహిత్య చరిత్రలో శిఖరం వంటి వారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గానసభలో శుక్రవారం రాత్రి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలుగు భాషలోనే విశ్వనాథ సత్యనారాయణ రచనలు అధికంగా చేసినప్పటికీ దేశ సాహిత్య చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విశ్వనాథ రచించిన వేయిపడగలు నవలను మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సహస్రఫణ్ పేరుతో హిందీ భాషలోకి అనువదించి దేశ స్థాయిలో తెలుగు సాహిత్య ప్రతిష్ఠను పెంచారన్నారు. గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పీఎం విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోండి

● యువతకు పిలుపునిచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ ● 20 లక్షల మందికి శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

రాంనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా అందించే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యానగర్ శివం రోడ్ ఏటీఐ ఆవరణలోని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో పీఎం విశ్వకర్మ పథకం ప్రథమ వార్షికోత్సవ సదస్సు, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. 17 కుల వృత్తుల వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ఈ పథకం ప్రారంభించారన్నారు. ఈ పథకం ద్వారా 20 లక్షల మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తుందని.. అయితే ఇప్పటి వరకు కేవలం 2.6 లక్షల మంది మాత్రమే సద్వినియోగం చేసుకోవడం బాధాకరమన్నారు. భారతదేశంలో ఉన్నంత యువశక్తి ఎక్కడా లేదని, వారి శక్తి దేశాభివృద్ధికి ఉపయోగపడేలా చేసేందుకు ప్రధాని మోదీ విశ్వకర్మం పథకం తీసుకువచ్చారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సత్ఫలితాలు సాధించాలంటే స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పట్టణ, జిల్లా, గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించి యువతను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ పొందిన వారికి బ్యాంకర్లు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. పేదలను ఇబ్బందులు పెడుతూ కార్పొరేట్ సంస్థలకు మాత్రం సులభంగా కోట్ల రూపాయల లోన్ ఇవ్వడంపై బ్యాంక్ అధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, బీసీ వెల్ఫేర్ కమిషన్ డైరెక్టర్ మల్లయ్య భట్టు, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్‌రావు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని, అయితే చాలా మంది ముందుకు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎస్.ప్రియ, అధికారులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలి

● ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

రాంనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల డిమాండ్లు, సమస్యల పరిష్కారం కోసం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యానగర్ చౌరస్తా శంకరమఠం, నల్లకుంట పద్మాకాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల పెండింగ్ ఫీజు చెల్లింపునకు రూ.4,500 కోట్లు విడుదల చేయాలన్నారు. విదేశీ విద్యానిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 40 శాతానికి పెంచి కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చర్యలపై పోరాడాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నల్లకుంట, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి శాశ్వత ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ద్వారా కార్మికులను నియమిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు సాదినేని వెంకటేశ్వరరావు, టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బి.ప్రదీప్ ఆరోపించారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అరుణ, శివబాబు అధ్యక్షతన 4 లేబర్ కోడ్‌లు, 3 నేర చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేస్తానని పేర్కొనడం బ్రిటీష్ కాలంలోనే కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను హరించడమేనన్నారు. మోదీ వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్దన్, జి.అనురాధ, గడ్డం నాగరాజు, కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

23న లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా



గోల్నాక, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డుతో అందించే ప్రయోజనాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న లేబర్ ఆఫీస్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి పెద్దఎత్తున కార్మికులు హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు, భవన నిర్మాణ కార్మికుల నగర కార్యదర్శి డి.ఎల్.మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ గోల్నాకలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ.. కార్మికులకు అందించే పథకాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను విరమించుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

భావతరంగాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

రాంనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రచయిత ఉదయపురి మధుమోహన్ రచించిన భావతరంగాలు పుస్తకావిష్కరణ సభ శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిపాటి వెంకటాచలం, సిరివెన్నెల, వేటూరి వంటి వివిధ కవులు జీవితంలో వారు పడిన శ్రమ, రాసిన కవిత్వాలు, కథలు సమాజానికి ఎంతగానో ఉత్తేజాన్ని ఇచ్చాయన్నారు. రచయిత వుదయపురి మధుమోహన్ మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో వాస్తవిక జీవితంలో అనుభవించిన సంఘటనలు, ఉద్యమాల ఘటనల గురించిన వివరాలు ఉన్నాయన్నారు. సోమన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు బీసీల అఖిలపక్ష సమావేశం

రాంనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రిజర్వేషన్లు 42 శాతానికి పెంపు, కులగణన, చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ల అమలు, ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాను భర్తీ చేయాలనే డిమాండ్లతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకాలో ఈ నెల 22న అఖిలపక్ష సమావేశం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అధ్యక్షత వహిస్తారని చెప్పారు. శుక్రవారం బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులు, బీసీ, ఉద్యోగ సంఘాల నేతలను ఆహ్వానించినట్లు తెలిపారు. బీసీ డిమాండ్లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలి

● బీజేపీ ఎస్సీ మోర్చా నేతల డిమాండ్



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు కొండేటి శ్రీధర్, ఎస్.కుమార్ తదితరులు

కవాడిగూడ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, రాజ్యాంగంపై అనుచిత వాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేయడం రాహుల్ గాంధీ రాజకీయ దివాళాకోరు తనానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ బీజేపీతోనే సాధ్యమన్నారు. గతంలో వాజ్‌పేయూ ప్రధానిగా ఉన్న కాలంలో కేంద్ర సంక్షేమ మంత్రిత్వ శాఖ పేరును సామాజిక న్యాయం, సాధికారత శాఖగా మార్చారని గుర్తుచేశారు. దళిత సామాజికవర్గానికి చెందిన బంగారు లక్ష్మణ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి క్రాంతికిరణ్, శివాజీ, ఉపాధ్యక్షులు ఓంప్రకాష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని లవ్ ఫర్ కౌవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జస్మత్ పటేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని అమ్మవారి ఆలయం వద్ద అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న గోరక్ష మహాపాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. బషీర్‌బాగ్ నుంచి శ్రీనగర్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడి నుంచి ఈ మహాపాదయాత్ర ప్రారంభం కానున్నది. అనంతరం ఆయన మాట్లాడుతూ భూరక్షణ, పర్యావరణం, దేశ రక్షణ గోమాతపై ఆధారపడి ఉంటుందని, గోవును పరిరక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గోరక్ష మహాపాదయాత్ర నిర్వాహకులు బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ ఈనెల 27న శ్రీనగర్‌లోని శ్రీశంకరాచార్య ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభమై జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, న్యూఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల గుండా సాగి కన్యాకుమారిలో 2025 మార్చి 27న ముగుస్తుందని తెలిపారు. 14 రాష్ట్రాలు, 4,900 కిలోమీటర్లు, 180 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. గోవును పరిరక్షించుకోవాలంటూ కరపత్రాలను ముద్రించి గ్రామగ్రామాన పంపిణీ చేస్తామన్నారు. ఈ పాదయాత్రలో గోవులు కూడా పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో గో సేవ ఫౌండేషన్ ప్రతినిధులు బోయిని నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌గౌడ్, పద్మాసంజయ్, సుక్కా తిరుపతి, ఆర్.ప్రవణ్ ప్రీతమ్, ఎన్.హేమంత్‌గౌడ్, ఇ.విద్యాసాగర్, ఆర్యసతీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు

● 26 నుంచి 28 వరకు హైటెక్స్ ప్రాంగణంలో..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ప్రోప్యాక్ ఎక్స్‌పో పేరుతో సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు నగరంలో మూడు అంతర్జాతీయ ప్రదర్శనలు జరగనున్నాయి. హైటెక్స్ ప్రాంగణం లో జరిగే ఈ ఎక్స్‌పోలలో 14 దేశాల నుంచి 500కు పైగా టెక్నాలజీ సప్లయర్‌లు పాల్గొంటారని మెస్సే మున్‌చెన్ ఇండియా సీఈవో భూపిందర్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమం ఫార్మా, లేబొరేటరీ టెక్నాలజీ పరిశ్రమకు ఉపయక్తంగా ఉంటుందన్నా రు. అధునాతన సాంకేతిక పరిష్కారాలు, ఉన్నత-స్థాయి చర్చలకు కీలక వేదికగా నిలుస్తుందన్నారు. ఇండియన్ ఎనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసోసియేషన్ (ఐఏఐఏ) ప్రెసిడెంట్ చంద్రహాస్ శెట్టి మాట్లాడుతూ అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పోతో ల్యాబ్ సాంకేతిక రంగాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా కొనసాగుతోందన్నారు. ఇండియన్ ఫార్మా మెషినరీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హర్షిత్‌షా మాట్లాడుతూ భారతదేశపు అతిపెద్ద ఫార్మా మెషీన్ తయారీదారుల సంఘంగా, ఫార్మా కంపెనీలు, యంత్ర తయారీదారులకు మధ్య ఉన్న సవాళ్లు, భవిష్యత్తు పరిష్కారాలను చర్చించడానికి సరైన వేదికగా ఈ ప్రదర్శనలు నిలువనున్నాయని పేర్కొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట-కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య మూసీ బ్రిడ్జి సమీపంలో 50-60 ఏళ్ల వయసు గల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి శరీరంపై గోదుమ రంగు ఆఫ్ షర్ట్, నశం రంగు ప్యాంట్ ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావని

డ్రైనేజీ సమస్యలపై కార్పొరేటర్ అసహనం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని టీఆర్‌టీ గ్రౌండ్(జనహితగ్రౌండ్) పరిసర ప్రాంతాల్లో తరచూ డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానికుల ఫిర్యాదు మేరకు జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లతో కలిసి ఆమె డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే సిబ్బందిని పిలిపించి క్లీనింగ్ వెహికిల్ ద్వారా మ్యాన్‌హోల్‌లోని సిల్ట్‌ను తొలగించారు. ఆమె మాట్లాడుతూ.. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంటమాలజీ సిబ్బంది కెమికల్, ఫాగ్ స్ప్రే చేయాలని చెప్పారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నేత శ్రీకాంత్, నాయకులు దోనేటి సత్యం, ఆనంద్‌రావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'నవభారత్ నిర్మాణంలో మహిళా విద్యావేత్తల పాత్ర'పై జాతీయ సెమినార్

అంబర్‌పేట, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): 'నవభారత్ నిర్మాణంలో మహిళా విద్యావేత్తల పాత్ర' అనే అంశంపై శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రాష్ట్రీయ్ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్య జైకిషన్, డాక్టర్ ఏలూరి యాదయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సెమినార్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్మన్ సుధానారాయణమూర్తి, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి సయ్యాని, జేఎన్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ పండిత్, తెలంగాణ విద్యా శాఖ కమిషనర్ ఏ.దేవసేన, ఏబీఆర్ఎస్ఎం జాతీయ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంతా లక్ష్మణ్ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎంల నుంచి సుమారు వెయ్యి మంది విద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

రాంనగర్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో జంతువుల నెయ్యి వాడి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ఘటనకు సంబంధించిన అధికారులను కఠినంగా శిక్షించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లడ్డూ తయారీలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె వంటి వాటితో తయారైన నెయ్యిని వాడారని గతంలో గుజరాత్‌కు సంబంధించిన సంస్థ తమ నివేదికలో పేర్కొందని తెలిపారు. జగన్ అధికారంలో ఉన్నంత కాలం ఇది జరిగిందని ఆరోపించారు. పవిత్రమైన శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై ఏపీ సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు సి.ప్రకాష్, యాదగిరిరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు మంత్రి పదవి ఇవ్వాలని వినతి



మాట్లాడుతున్న ఆరె దశరథం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ జనాభాలో అత్యధిక శాతం ఉన్న మున్నూరుకాపులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని రాష్ట్ర మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం సీఎం రేవంత్‌రెడ్డిని విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం మాట్లాడారు. మున్నూరుకాపులకు మంత్రివర్గంలో చోటు లేకపోవడం దురదృష్టకరమని, మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మున్నూరుకాపుల కృషి ఎంతో ఉందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ సముచిత స్థానం కల్పించాలని కోరారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేయడంపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని సీఎం రేవంత్‌ను కోరారు. ప్రధాన కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం



సీఐ రాంబాబును సన్మానించిన బీఆర్ఎస్ నేతలు శ్రీధర్‌చారి, ప్రభాకర్

ముషీరాబాద్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే వినాయక చవితి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రశాంతంగా జరిగాయని ముషీరాబాద్ సీఐ జి.రాంబాబు అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ముషీరాబాద్ పోలీసులను సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా పండుగలను జరుపుకుంటూ మతసామరస్యాన్ని పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు. డీఐ నదీం హుస్సేన్, ఎస్సై ప్రశాంత్‌రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు అస్లాం, శంకర్ ముదిరాజ్, అరుణ్, మున్నా, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టీల్‌బ్రిడ్జిపై ఆకతాయిల ఆగడాలను అరికట్టండి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జిపై ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. నంబర్ ప్లేట్ బైక్‌లతో ఫీట్‌లు వేస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. వారి చేష్టలతో వాహనదారులు ఇబ్బందులకు గురికావడంతో పాటు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో పలువురు ఆకతాయిలు స్టీల్‌బ్రిడ్జిపై మద్యం తాగి ఖాళీ సీసాలను ఆర్టీసీక్రాస్‌రోడ్ జవహర్‌నగర్‌లోని లేడీస్ హాస్టళ్లపైకి విసిరిన సంగతి తెలిసిందే.